క్లుప్తంగా

విశ్వకర్మ జయంతికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: కురుపాంలో ఈ నెల 17న జరిగే విశ్వకర్మ జయంతికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు విశ్వబ్రాహ్మణ సంఘం, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు చింతాడ తవిటాచారి తదితరులు ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు.

సేవలతోనే గుర్తింపు..



చంద్రమౌళిని సన్మానిస్తున్న డీస్పీ రాంబాబు, తదితరులు

పాలకొండ: పోలీసులు మంచి సేవలు అందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. సీఐగా ఇక్కడ విధులు నిర్వహించి విశాఖకు బదిలీపై వెళ్తున్న మీసాల చంద్రమౌళిని ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నో కీలక కేసులను సీఐ చంద్రమౌళి ఛేదించారని చెప్పారు. బదిలీ ప్రాంతంలో కూడా మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, దోనుబాయి, బత్తిలి ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని జోగులడుమ్మ గ్రామానికి చెందిన బలివాడ లక్ష్ముంనాయుడు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి..ఆ గ్రామానికి ఆదివారం వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట కన్వీనర్ కోట రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, లోలుగు నారాయణరావు, బలగ వెంకటరమణ, సర్పంచ్ తవిటినాయుడు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యానికి మేలు..

సీతంపేట: సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని ఎస్సై వై.అమ్మన్నరావు అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం సండే ఆన్ సైకిల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సైకిల్ తొక్కుతూ వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

కూలిన భారీ వృక్షం

సీతంపేట: మండలంలోని కె.గుమ్మడ సమీపంలో ఓ వృక్షం రోడ్డుపై కూలిపోవడంతో ఆదివారం ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో స్థానికులు స్పందించి చెట్టు కొమ్మలు తొలగించారు. దీంతో వాహన రాకపోకలకు వీలు కలిగింది.

శ్రమదానం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని దాసరిపేట వివేకానంద యువజన సంఘం యువత ఆదివారం శ్రమదానం చేసి మరీ గ్రామ పరిసరాలను శుభ్రం చేశారు. రోడ్లు, కాలువల వద్ద విచ్చలవిడిగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

పేరుకే ఆధార్ సేవా కేంద్రం.. సేవలు మాత్రం నిల్!



మండల కేంద్రంలో సేవలు కానరాని ఆధార్ సేవా కేంద్రం

గరుగుబిల్లి: పేరుకే అది ఆధార్ సేవా కేంద్రం.. అక్కడకు వెళ్తే సేవలు ఉండవు..ఇదంతా మండల కేంద్రంలోని ఆధార్ సేవా కేంద్రం గూర్చి. కొన్ని నెలల క్రితం హడావిడిగా ప్రారంభించిన ఈ కేంద్రంలో తొలినాళ్లలో సేవలు బాగా ఉండేవి..ఇప్పుడు అస్సలు అక్కడ ఎవరూ లేకపోవడం, ఎటువంటి సేవలు అందించకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం ప్రజలు సహా పెద్దూరు, రావుపల్లి, గొట్టివలస, బురదవెంకటాపురం, ఉద్దవోలు, కొత్తపల్లి, శివ్వాం, మరుపెంట, తులసిరామినాయుడువలస తదితర గ్రామాల ఇదే కేంద్రంపై సేవలకు ఆధారపడుతున్నారు. ఇప్పుడు అక్కడ సేవలు అందించకపోవడంతో గిజబ గ్రామంలోని మీసేవా కేంద్రానికి వెళ్తున్నారు. దీంతో వ్యయప్రయాసలకు గురవుతున్నామని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆధార్ సేవా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐటీఐ ఏర్పాటయ్యేనా..!



ఐటీఐ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలం ఇదే..

- మరియగిరి సమీపంలో గతంలోనే స్థల సేకరణ
- ఈ అంశాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నాయకులు, అధికారులు స్పందించాలి: ప్రజలు

వీరఘట్టం: మండలంలో ఐటీఐ ఏర్పాటు విషయాన్ని గత ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అంగీకారం తెలిపారు. దీంతో మండల కేంద్ర సమీపంలోని మరియగిరి వద్ద సర్వే నంబర్ 5/1 లో ఉన్న 5 ఎకరాల స్థలంలో ఐటీఐ ఏర్పాటు చేసేందుకు గతంలో అధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. ఈ ప్రాంతంలో ఐటీఐ ఏర్పాటైతే వీరఘట్టం మండలంతో పాటు సమీపంలో ఉన్న సీతంపేట, గరుగుబిల్లి, పాలకొండ, జియ్యమ్మవలస మండలాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే స్థల పరిశీలన జరగడంతో ఐటీఐ ఏర్పాటవుతుందని ఆశించిన ప్రజానీకానికి నిరాశే మిగిలింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ అంశం గురించి పట్టించుకోలేదు. దీంతో మండలంలో ఐటీఐ ఏర్పాటు కలగానే మిగిలింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కూటమి నాయకులు, అధికారులు స్పందించి ఐటీఐ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

500 మందికి పైగా విద్యార్థులు..

ప్రతి ఏటా వీరఘట్టం, సీతంపేట, పాలకొండ, జియ్యమ్మవలస, తదితర మండలాల నుంచి టెన్త్, ఇంటర్ పాసైన విద్యార్థులు సుమారు 500 మంది వరకు ఐటీఐ చదువుకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. స్థానికంగా ఐటీఐ ఉంటే ఇక్కడే చదువుకునే వెసులుబాటు ఉంటుందని, అలాగే ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి....

స్థానికంగా ఐటీఐ ఉంటే నిరుద్యోగ పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయని విద్యావేత్తలు అంటున్నారు. ముఖ్యంగా ఈ కోర్సు చేసిన వారు స్వయం ఉపాధి పొందవచ్చు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఐటీఐ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకురావాలి..



ప్రతి ఏటా సాంకేతిక విద్య కోసం వందలాది మంది విద్యార్థులు జిల్లాను దాటి వెళ్తున్నారు. ఐటీఐ లాంటి సాంకేతిక విద్య అందుబాటులో ఉంటే చాలా మంది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వీరఘట్టంలో ఐటీఐ ఏర్పాటుకు ప్రభుత్వం చొరవచూపాలి. – భోగి మణి, మెడికల్ షాపు యజమాని, వీరఘట్టం

విద్యాభివృద్ధికి కృషి చేయాలి..



స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు వీరఘట్టం మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఐటీఐ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. తర్వాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి ఐటీఐ ఏర్పాటుకు కృషి చేయాలి.

– నల్లబిల్లి విస్సు, వీరఘట్టం

తోటపల్లి కాలువలను ఆధునీకరించండి

- ఎమ్మెల్సీ విక్రాంత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ: తోటపల్లి కాలువలను ఆధునీకరించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ..ఈ ప్రాంత రైతుల చిరకాల వాంఛ అయిన కాలువల ఆధునీకరణ పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేయడం దారుణమన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో కాలువల ఆధునీకరణకు బీజం పడిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతం అధికారం చేపట్టిన టీడీపీ ఆ విషయాన్ని మరుగున పెట్టిందని చెప్పారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాలువల ఆధునీకరణ పనులు ప్రారంభించిందని తెలిపారు. అనంతర కాలంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనులు నిలిపివేయడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదన్నారు. పాలకొండ, వీరఘట్టం మండలాల పరిధిలోని సుమారు 45 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఎడమ కాలువ ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపట్టక తప్పదని స్పష్టం చేశారు.

ఆయనతో పాటు పాలకొండ, వీరఘట్టం మండల కన్వీనర్లు కనపాక సూర్యప్రకాష్‌రావు, దమలపాటి వెంకటరమణనాయుడు, పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు ఉన్నారు.

రైతన్నకు కూటమి దగా



వాల్‌పోస్టరు ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

- మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: రైతన్నకు కూటమి దగా చేసిందని, సకాలంలో సాగు సాయం, ఇప్పుడు ఎరువులు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి విమర్శించారు. మండలంలోని చినమేరంగి గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో 'ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు' కార్యక్రమం వాల్‌పోస్టర్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాకు ఇంత అనుభవం..అంత అనుభవం అని చెప్పుకునే చంద్రబాబుకు తెలీదా రైతులకు సరిపడా ఎరువులు అందించాలని, వాటిని ముందుగానే సిద్ధం చేసి ఉంచాలని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల వారికీ అన్యాయమే జరుగుతోందన్నారు. ఓట్లు వేసిన పాపానికి రోడ్లు ఎక్కిస్తున్నారని, ఎరువుల కోసం రాత్రి, పగలూ మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నా పట్టదా అని నిలదీశారు. రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా రైతులకు అందించాల్సిన యూరియాను అధికార పార్టీ నాయకులు దారి మళ్లించారని, దీనిపై ఈ నెల 9వ తేదీన చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం, పాలకొండ ఆర్డీవో కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి, జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు, కిశోర్, బలగ వెంకటరమణ, లోలుగు నారాయణరావు, అల్లు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయిన యూరియా



రైతుపోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విక్రాంత్, తదితరులు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్
- రైతుపోరు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పాలకొండ: కూటమి ప్రభుత్వం యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ధ్వజమెత్తారు. ఈ నెల 9న చేపట్టనున్న రైతుపోరు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలోని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ యూరియా కోసం ఇబ్బంది పడే పరిస్థితులు రాలేదన్నారు. ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి యూరియా కొరతలేదని ప్రకటిస్తున్నారని, అయితే వాస్తవ పరిస్థితులు వారికి తెలియవా అని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలైమందని ఆరోపించారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా బస్తా రూ. 8 వందల నుంచి వెయ్యి రూపాయల వరకు విక్రయిస్తున్నారని తెలిపారు. వచ్చిన యూరియాను వచ్చినట్లే అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. అన్నదాతకు అన్యాయం చేయడం తగదన్నారు. రైతుకు మద్దతుగా ఈ నెల 9న ఆర్డీఓ కార్యాలయం వద్ద రైతుపోరు పేరిట ధర్నా చేపట్టనున్నామని, ఈ కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల మూసివేత

పాలకొండ: చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి పలు ఆలయాలను మూసి వేశారు. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంతో పాటు గాయత్రి మంత్రాలయం, సంతోషిమాత ఆలయం, పలు శివాలయాలు మూతబడ్డాయి. సోమవారం ఉదయం సంప్రోక్షణం అనంతరం ఆలయాలను తిరిగి తెరుస్తామని కోటదుర్గమ్మ ఆలయ ప్రధానార్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జియ్యమ్మవలస: ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక మండలంలోని చినమేరంగి జేబీ పాఠశాలలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా పల్ల మోహనరావు, ప్రధాన కార్యదర్శిగా డొంకాడ సింహాచలం, గౌరవ అధ్యక్షులుగా రంగయ్య, ఎర్రయ్య, ఉపాధ్యక్షులుగా ఎం.శశికుమార్, శివకుమార్, శ్రీనివాస్, పద్మావతిలు ఎన్నికయ్యారు. ఈ మేరకు వారికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

అన్నివర్గాల సమన్వయంతో ఉత్సవాలు



పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానంలో ఈ ఏడాది నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్నివర్గాల సహకారం తీసుకుంటామని దేవస్థానం కార్యనిర్వహక అధికారి సూర్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగిస్తామన్నారు. ఇదిలా ఉంటే సోమవారం ఉదయం 9 గంటల నుంచి ప్రధాన ఆలయంలో గల అమ్మవారు తెరచాటుకు వెళ్లనున్నట్లు తెలిపారు. నేటి నుంచి దేవస్థానం ప్రాంగణంలోగల ఉత్సవమూర్తికే పూజలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. 22న దేవస్థానంలో దసరా ఉత్సవాలకు సంబంధించి సంప్రదాయ ముహూర్తపు రాట వేస్తారని చెప్పారు. అదేరోజు అమ్మవారి నిజరూప దర్శనం మొదలుకుని శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వరదనీటిలో జె.కళిగొట్టు గ్రామం..



గ్రామంలోకి చేరిన వరదనీటిని పరిశీలిస్తున్న తహసీల్దారు శేఖర్

గుమ్మలక్ష్మీపురం: భారీవర్షం కారణంగా ఎల్విన్‌పేట పంచాయతీ, జె.కళిగొట్టు గ్రామంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఆదివారం మధ్యాహ్నం ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు పెద్దఎత్తున చేరుకుంది. ఈ క్రమంలో గ్రామం కూడా లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వాన నీరు వచ్చేసినట్లు పలువురు చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దారు ఎస్.శేఖర్..ఆర్ఐ బి.శివతో కలిసి గ్రామాన్ని సందర్శించి గ్రామంలోకి చేరిన వరదనీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి ఎగువన రిటైనింగ్ వాల్ నిర్మించి వర్షపునీరు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తహసీల్దారును కోరారు. దీనిపై తహసీల్దారు కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.


వరద కాలువలోకి నీరు

భామిని: వంశధార ప్రాజెక్ట్ వరద కాలువలోకి నది నీరు ఆదివారం ప్రవేశించింది. మండలంలోని కాట్రగడ–బి వద్ద వంశధార నదిపై నిర్మించిన ఓపెన్‌హెడ్ చానల్ గుండా సైడ్ వియ్యర్ ద్వారా వరద నీరు కాలువలోకి చేరింది. ఒడిశాకు చెందిన బోడసల్ ప్రాజెక్టులోని అదనపు నీరు విడిచి పెట్టడంతో వరద కాలువల్లోకి నీరు చేరుతోందని వంశధార ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.



వరదకాలువలో పారుతున్న వంశధార నది నీరు

నీట మునిగిన పంటపొలాలు



కె.శివడ జంక్షన్ వద్ద చెరువును తలపిస్తున్న పంటపొలాలు

గుమ్మలక్ష్మీపురం: మండల వ్యాప్తంగా ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం దాదాపు గంటన్నర కాలం పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో జలమయమయ్యాయి. ఈ క్రమంలో పంటపొలాలు నీటమునిగాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యూరియా కోసం తప్పని పాట్లు

పాలకొండ:

యూరియా కోసం రైతుల అవస్థలు కొనసాగుతున్నాయి. అన్నదాతకు యూరియా అందేవరకు వారికి పార్టీ పరంగా అండగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపునివ్వడంతో కూటమి ప్రభుత్వంలో వణుకు మొదలైంది. దీంతో పాలకులు అరకొరగా యూరియా పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పలు రైతుసేవా కేంద్రాల్లో అరకొరగా యూరియా సరఫరా చేశారు. యూరియా బస్తా కోసం రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని కొండాపురం ఆర్ఎస్‌కే వద్ద గంటల తరబడి రైతులు నిరీక్షించాల్సి వచ్చింది. సకాలంలో యూరియా అందించలేని కూటమి ప్రభుత్వం తీరుపై అన్నదాతలు మండిపడుతున్నారు.



కొండాపురం ఆర్ఎస్‌కే వద్ద రైతుల నిరీక్షణ

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సదుపాయాలు కరువు

పాలకొండ రూరల్: ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలను ప్రయాణికులను వెక్కిరిస్తున్నాయి. ప్రతి రోజూ లక్షలాది రూపాయలు ఆర్జించే ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కాంప్లెక్స్‌లో పారిశుధ్యం పడకేసింది. అలాగే రూ. లక్షలు ఖర్చుచేసి నిర్మించిన మరుగుదొడ్లు మూలకు చేరాయి. ఇన్, ఔట్ గేట్ల వద్ద ఏర్పాటు చేసిన మరుగుదొడ్లుకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. తాగునీటి సదుపాయం కూడా అంతంత మాత్రంగాను ఉంది. తాజాగా కురుస్తున్న వర్షాలకు పరిసరాలు మరింత అధ్వానంగా మారాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులపై మీడియాలో కథనాలు ప్రచురితమైనా అధికారుల్లో చలనం రాకపోవడం విశేషం. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వృథాగా ఉన్న మరుగుదొడ్లు

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం

గుమ్మలక్ష్మీపురం: పల్లె పండగ పేరిట అధికారంలోకి వచ్చిన కొత్తలో కూటమి ప్రభుత్వం..మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ, బొడ్లగూడ గ్రామ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దొరజమ్ము రోడ్డు నుంచి బొడ్లగూడ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.1.10 కోట్లు మంజూరు కాగా సంబంధిత కాంట్రాక్టరు రూ.32 లక్షలు వెచ్చించి పనులు మొదలుపెట్టారు. పనులు ప్రారంభించి దాదాపు 10 నెలలు కావస్తున్నా నిర్మాణం పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అసంపూర్తిగా బొడ్లగూడ రోడ్డు నిర్మాణ పనులు

విస్తారంగా వర్షాలు..



పాలకొండ రూరల్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: అల్పపీడనం ప్రభావంతో ఆదివారం సాయంత్రం పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లోతట్టు వరి పొలాల్లో నీరు నిలిచిపోయింది. నీటిని బయటకు పంపి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న రైతులకు తాజా వర్షంతో మళ్లీ ఆందోళన నెలకొంది. యూరియా కొరత ఓ పక్క వేధిస్తుండగా.. అధిక వర్షాలతో ముప్పు తప్పేటట్లు లేదని రైతులు వాపోతున్నారు. తుమరాడ, తంపటాపల్లి, భాసూరు, వీపీ.రాజుపేట, తదితర గ్రామాల పరిధిలో వరి పంట పొలాలు మునిగిపోయే ప్రమాదం ఉంది.

భామిని: మండలంలో ఆదివారం కురిసిన వర్షం ప్రజలకు ఊరట నిచ్చింది. మెట్టు పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు చెబుతుండగా.. వాతావరణం చల్లబడడంతో ప్రజలకు ఊరట లభించింది.